క్లుప్తంగా

ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర అన్నారు. కొండపల్లిలో ఎస్టీల ఆత్మీయ సమావేశంలో జిల్లా డైరెక్టర్ జె.సునీతతో కలిసి ఆయన గురువారం పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఆదరించిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్ర కొండ గురవయ్య, 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ స్థానిక సమస్యలు ఆయనకు వివరించారు. ఎస్టీ కాలనీలో మురుగు నీరు పారుదలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అడ్డుగా ఉన్న నిబంధన తొలగించాలని కోరారు. ఈసందర్భంగా నాయకులు సురేంద్రను అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి అన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరువూరు షాదీఖానాలో ప్రాజెక్టు స్థాయిలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు అవగాహనా కార్యక్రమాలు, ప్రదర్శన చేపట్టారు.

19న రామాలయ భూముల కౌలు వేలం

చాట్రాయి: మండలంలోని చనుబండ కోదండ రామాలయ భూముల కౌలు వేలం ఈ నెల 19న ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి గురువారం తెలిపారు. ఒక్కో ప్లాట్‌కు రూ.4 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు చేయూత

మైలవరం: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు మైలవరం మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ గురువారం చేయూతనందించారు. మైలవరం తారకరామా నగర్‌కు చెందిన పేద మహిళ రాణి ఇటీవల అనారోగ్యంకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతుంది. స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి సాగా వెంకటేశ్వర రావు సమాచారం ఇవ్వడంతో సుధ మూడు నెలలకు సరిపడా బియ్యం, పచారి సరకులు మహిళకు అందజేశారు. సాగా వెంకటేశ్వరరావు, ట్రస్ట్ , వార్డు సభ్యులు వహీదున్నీసా, దారా మాధవి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓటు హక్కుపై గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఖిల్లా రోడ్డులోని నూతన కాలనీలో పర్యటించి ప్రజలకు ఓటు ప్రాధాన్యం, వినియోగంపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్డ్ పవర్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ



మైలవరం: వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ ఇన్ ఆంధ్రప్రదేశ్ 2023–24లో మైలవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని ఎంఈఓ ఎల్.బాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ హరిత బెరమ్ పార్క్ హోటల్‌లో వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం జరిగాయన్నారు. కనిమెర్ల, మైలవరం ఎంపీపీ స్కూల్ విద్యార్థులు బి.రేవతికుమార్, బి.అనిల్‌కుమార్, కందుల లిడియా పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మునుకుళ్ల(తిరువూరురూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులు భయపడకూడదని తిరువూరు మండలం మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తిరువూరుకు చెందిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మాదాసు పిలిప్ పరీక్షలకు అవసరమైన ప్యాడ్స్, పెన్నులు, జామెట్రీ బాక్సులను గురువారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బీహెచ్ఈఎల్ బస్సు సర్వీస్ ప్రారంభం

తిరువూరు: ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు తిరువూరు నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు శుక్రవారం నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికుల సూచన మేరకు ప్రతిరోజూ రాత్రి 9.45 గంటలకు బయలుదేరి ఉదయం 6 గంటలకు బీహెచ్ఈఎల్ చేరుతుందన్నారు. హైదరాబాద్‌లో ప్రతి రోజు రాత్రి 10.15 గంటలకు బీహెచ్ఈఎల్ నుంచి ఈ బస్సు బయలుదేరుతుందని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి జగనే మళ్లీ సీఎం కావాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులోని ఎంప్లాయీస్ కాలనీలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: రాష్ట్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని 32 వార్డుల్లో రూ.16 కోట్లతో నిర్మించనున్న సీసీ డ్రెయినేజీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, ఐటీఐ కాలేజీలో రూ.1.15 కోట్లతో చేపట్టనున్న భవనాల రిపేర్లకు సంబంధించిన పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రజలందరూ సంతోషంగా జీవించాలన్నా జగన్ ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిందని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్వయం సహాయక సంఘాల మహిళల రుణాలను మాఫీ చేయడంతో పాటు వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు వారి గడప వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. 10 ఫిషింగ్ హార్బర్స్, నాలుగు పోర్టులను అభివృద్ధి చేయడంతో పాటు 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌కు ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌ను మరోమారు గెలిపించుకోవాలని చెప్పారు.

చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు

రాష్ట్రాన్ని 14 ఏళ్ల పాటు పాలించిన చంద్రబాబు ఈ రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమేదైనా ఉందా అని నిలదీశారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఏమీ లేదని, రాజధాని పేరుతో భూ కుంభకోణానికి పాల్పడిన ఘనత చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, నవుడు నాగమల్లేశ్వరరావు, కాలి సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్



మైలవరంలో చెక్కు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావు, నాయకులు

మైలవరం: పేదలకు అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లవేళలా ఉంటారని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు తెలిపారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం సర్నాల అందజేశారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే అన్నారు. మైలవరం మండలం సీతారామపురం తండాకు చెందిన బారోతు బాలాజీకు రూ.26 వేలు, ఉయ్యూరు నాగిరెడ్డికి రూ.1.80 లక్షలు, గోపాల్ కన్షిక్‌కు రూ.10 లక్షలు, కొమ్మూరి పద్మావతికి రూ.65 వేలు, మాధురి శైలజరాణికి రూ.1.30 లక్షలు, సాంబశివరావుకు రూ.1.20 లక్షలు, నారా వరప్రసాద్‌కు రూ.1.30 లక్షలు, దేవి అనంతలక్ష్మికి రూ.60 వేలు, మాధవరావుకు రూ.1.30 లక్షలు, గడ్డం శారమ్మకు రూ.1.30 లక్షలు, అలవల లక్ష్మికి రూ.1.30 లక్షలు, బెజవాడ రామ కోటేశ్వరరావుకు రూ.55 వేలు విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యం



తిరువూరులో కరపత్రాన్ని అందజేస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: రాష్ట్రంలో అందజేస్తున్న సంక్షేమ పథకాల కొనసాగింపు సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. స్థానిక నాలుగో వార్డులో గురువారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించిన ఆయన తోకపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిశారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని రీతిలో నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రజలకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీకి ఉన్న తేడా గమనించాలని, పేదల సంక్షేమానికే ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, తిరుమలశెట్టి వేణు, పాలం రమాదేవి, గోపాలరావు, పరసా సత్యనారాయణ, మోదుగు ప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, రామారావు, రవి, బాలకృష్ణ, రాజ్‌మహ్మద్, దుర్గారావు, చెన్నారావు, వెంకటనారాయణరెడ్డి, నెహ్రూ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



గంపలగూడెంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో 24 గంటల పీహెచ్‌సీలు పనితీరును తెలుసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం రాత్రి మూడు పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, సేవలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాత్రి 10.10 గంటల సమయంలో పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అటెండెన్స్ రిజిష్టర్ చూశారు. అనంతరం రాత్రి 10.50 గంటలకు ఏ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇడీడీ క్యాలెండర్, డెలివరీ రూమ్ సౌకర్యాలు, మందులు అందుబాటు వంటి వాటిని పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రసూతి సేవలను 24 గంటలు అందుబాటులో ఉండాలని, అందుకు అనుగుణంగా విధులకు హాజరు కావాలని సూచించారు. తమ తనిఖీల్లో గైర్హాజరు అయినట్లు గుర్తిస్తే షోకాజ్ నోటీసుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు 131 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో భాగంగా పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన రసాయనశాస్త్రం, కామర్స్ సబ్జెక్టుల పరీక్షకు 1,724 మంది విద్యార్థులకు గాను 98 మంది గైర్హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 436 మందికి 43 మంది, సెయింట్ ఆన్స్‌లో 295 మందికి 17 మంది, శ్రీ శారదలో 381 మందికి 11 మంది, శ్రీవాగ్దేవిలో 341మందికి 14 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 271 మందికి 13 మంది గైర్హాజరయ్యారు. 144వ సెక్షన్‌ను అమలు చేశామని తహసీల్దార్ విశ్వనాథ శాస్త్రి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా దుర్గాప్రసాద్, టి.విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర వర్మ వ్యవహరించారు.

తిరువూరు: తిరువూరులోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 262 మందికి 249 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 251కి 246, నాగార్జున జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో 315కి 305, శ్రీనిధి జూనియర్ కళాశాల కేంద్రంలో 249 మందికి 244 మంది హాజరయ్యారు. మొత్తం 33 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం

ఏ.కొండూరు: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అపోలో డయాలసిస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వైద్యాధికారి దివ్య మాట్లాడుతూ.. అధిక మోతాదులో మందులు వాడకం, తక్కువగా మంచినీరు తాగడం, ఆహారంలో ఉప్పు అధికంగా వాడటంతో మూత్రపిండాలపై ప్రభావం చూపుతోందన్నారు. ఈ మండలంలో తాగునీటిలో సిలికాన్ అధికంగా ఉందని, ఈ నీటిని తాగడం వల్ల కిడ్నీ వ్యాధిన బారిన పడుతున్నారన్నారు. కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లో ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీరు అందిస్తుందని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసిందని చెప్పారు. అలానే కృష్ణా జలాలను సరఫరా చేస్తోందని ఈ స్వచ్ఛమైన తాగునీరు తాగడం వల్ల కిడ్నీ సమస్యలు రావన్నారు. కిడ్నీ రోగులకు వైద్యం అందించటానికి డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో పాటు ఉచితంగా మందులు మెరుగైన వైద్యం అందించడంలో చర్యలు తీసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.సుహాసినికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీకృష్ణ, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



మైలవరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

మైలవరం: రాబోయే 2024 ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు మైలవరం ఏసీపీ ఎస్.మురళీమోహన్ తెలిపారు. మైలవరం ఏసీపీ కార్యాలయంలో విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు జగ్గయ్యపేట డీసీపీ కె.శ్రీనివాసరావు సూచనలతో గురువారం ఆంధ్ర, తెలంగాణా పోలీస్‌లతో ఇంటర్ స్టేట్ బోర్డర్ ఎస్ఐలు, సీఐలు, ఏసీపీలు, ఇరు రాష్ట్రాల స్పెషల్ బ్రాంచ్ అధికారుల సమావేశం జరిగింది. రాబోయే ఎన్నికలు పురస్కరించుకుని అనుమానిత రహదారుల్లో చెక్‌పోస్టులు, స్పెషల్ మొబైల్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించినట్లు ఏసీపీ మురళీమోహన్ తెలిపారు. తెలంగాణా బోర్డర్ వైపు ఉన్న బోర్డర్ చెక్‌పోస్టులు పనితీరుపై ఆరా తీశారు. డబ్బు, మద్యం, వస్తు రవాణాను పరిమితం చేశాం, అలాగే సరిహద్దు ప్రాంతాల నుంచి తెలంగాణా రాష్ట్రానికి అసాంఘిక అంశాలు ప్రవేశించకుండా నిరోధించబడతాయన్నారు. రౌడీషీటర్ల కదలికలు, సమాచార మార్పిడిపై చర్చించారు. ప్రీ పోల్, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత తలెత్తే పరిస్థితులను సమీక్షించారు. మొత్తం ఎన్నికలు శాంతియుతంగా పూర్తి చేయాలని చర్చించారు. సమావేశంలో ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్‌ను సందర్శించిన డీసీఓ

తిరువూరు: జిల్లా సహకార అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి గురువారం తిరువూరు కేడీసీసీ బ్యాంక్‌ను సందర్శించారు. తిరువూరు మండలంలో సహకార సంఘాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు, బ్యాంక్ పరిధిలో నిర్మించిన గోదాములను పరిశీలించారు. రబీ సీజన్‌లో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాల లక్ష్యాలపై సమీక్షించారు డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మేనేజరు ఆజాద్, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఈదులగూడెంలో పట్టాల పంపిణీ

ఆగిరిపల్లి: ఈదులగూడెంలో 148 మంది లబ్ధిదారులకు గురువారం రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పీఏసీఎస్ అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్, గొర్రెల పెంపకం దారుల జిల్లా డైరెక్టర్ గంగాధర్‌రావు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరేపల్లి రామకృష్ణ , వీఆర్వో శ్రీనివాసరావు, చిట్నేని శేషగిరి రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్ కాయిన్ అందజేత

రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఎం.విజయలక్ష్మి సూచించారు. తిరువూరు క్లస్టర్ పరిధిలోని రెడ్డిగూడెం మండలం ఆలివేలు మంగాపురం పాల సంఘంలో పాల ఉత్పత్తిదారులైన తోర్లికొండ కృష్ణకుమారి కుమారుడు వెంకట్రావు వివాహం సందర్భంగా యూనియన్ అందజేస్తున్న కల్యాణమస్తు పథకం ద్వారా రూ.20 వేలు విలువైన గోల్డ్ కాయిన్‌ను గురువారం అందజేశారు. తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షురాలు బొమ్మిన వైదేహి, రూట్ సూపర్‌వైజర్ బి.శివ నాగేశ్వరరావు, వేతన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

రెడ్డిగూడెం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాతనాగులూరు ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్, ఎస్టీయూ రెడ్డిగూడెం మండల శాఖ గౌరవాధ్యక్షుడు ఎం.ఆదాం ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో నాగులూరు కాంప్లెక్స్ చైర్మన్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుడిగా అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.రామారావు, ఉపాధ్యాయులు పి.ప్రేమ్‌కుమార్, ఎస్టీయూ మండల అధ్యక్షులు బి.అనిల్‌కుమార్, బి.మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్.నాగరాజు, జి.సుధారాణి, అంజనాదేవి, రజిని, ఉషారాణి, నాగమణి, సునీత, హర్షవర్ధిని, భూషణం, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



వెల్వడంలో విద్యార్థినికి కిట్ అందజేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి, ఉపాధ్యాయులు

వెల్వడం(మైలవరం): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, తోటి వారికి సహాయం చేసే సద్గుణాలను అలవర్చుకోవాలని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి తెలిపారు. వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైలవరంలోని మాదాల బుల్లయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే 230 మంది విద్యార్థులకు అవసరమైన కిట్‌లను గురువారం అందజేశారు. పూర్వ విద్యార్థుల సహకారంతో కిట్‌లు అందజేశామన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష కిట్‌లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నాడు నేడు ద్వారా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఎల్‌బీఆర్‌సీఈ పూర్వ విద్యార్థులు ఆలుమ్ని అసోసియేషన్‌కు పాఠశాల హెచ్ఎం పి.లక్ష్మి, సాయికుమారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జడ్ నరసింహారెడ్డి, ఎల్‌బీఆర్‌సీఈ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

గోపవరం(ముసునూరు): మండుటెండల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ రోజ్‌లీల సూచించారు. ముసునూరులో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెంట్లు, చల్లని మంచినీరు, మజ్జిగ అందించాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు ఆమె అందజేశారు. కార్యక్రమాల్లో ఆరోగ్య శాఖ, ఉపాధి హామీ సిబ్బంది, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

ముసునూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు సివిల్ సప్లయ్ స్పెషల్ డెప్యూటీ తహసీల్దార్ గుండుబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని పెదపాడు మండలం దాసరిగూడెంకు చెందిన మల్లవల్లి శ్యామ్, మల్లవల్లి శివరంగారావు ట్రక్కులో అక్రమంగా 19 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్నారు. బాపులపాడు మండలంలోని కొయ్యూరుకు తరలిస్తుండగా కొర్లగుంట శివారు సింహాద్రిపురం వద్ద విజిలెన్స్ సీఐ విల్సన్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు స్పెషల్ డీటీ చెప్పారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్

నూజివీడు: పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ తెలిపారు.

మహాజన సభ నోటీసు

ది. తిరువూరు, గంపలగూడెం మరియు ఎ.కొండూరు మండల స్కూలు టీచర్సు కో.ఆపరేటివ్ క్రెడిట్‌సొసైటీ తిరువూరు, K.R.9, ఎన్‌టి.ఆర్. జిల్లా

ది. 31-03-2024 ఆదివారం మధ్యాహ్నం గం॥ 2-00 లకు తిరువూరు సంఘ కార్యాలయము నందు సంఘం యొక్క మహాజన సభ జరుగును. సంఘ సభ్యులందరూ హాజరు కావలసినదిగా కోరుచున్నాము.

ఎజెండా : 1. జమ ఖర్చులు ఆమోదము. 2. అధ్యక్షులు వారిచే ప్రవేశపెట్టబడు ఇతర అంశములు.

గోసు శ్రీనివాసరావు, కార్యదర్శి

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

ఆగిరిపల్లి: సీతారాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం అడవినెక్కలం, ఈదర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాంప్లెక్స్ స్థాయి పరీక్షలు ఉపాధ్యాయులు నిర్వహించారు. 3వ తరగతి నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు, మౌఖిక పరీక్ష, టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. విజేతలకు సీతారాంపురం సర్పంచ్ అత్తి మురళి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి–1, 2 సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్య రక్షణకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల ఆరోగ్య రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారని, అందులో భాగంగానే గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసిందని గొల్లపూడి పంచాయతీ ఎంపీటీసీ నంధ్యాల దుర్గారావు పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని పోలేరమ్మ గుడి సమీపంలో గల రామరాజ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (వెల్‌నెస్) – 4 కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఈ వెల్‌నెస్ సెంటర్‌లో పేద ప్రజలకు వివిధ రక్తపరీక్షలు నిర్వహించటం, రోగ నిర్ధారణ చేసి మందులను అందజేస్తారన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రామరాజ్యనగర్ ప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్న పేద ప్రజలు ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలి

నూజివీడు: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు మద్దతు ధరల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టంను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, సీపీఐ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో నిరసన

ఆగిరిపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగిరిపల్లిలో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు, రైతు, రుణమాఫీ చట్టం, 60 ఏళ్లు నిండిన పేద రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ముఠా కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరువూరులో ధర్నా

తిరువూరు: రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ తిరువూరులో గురువారం రైతుసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అఖిలపక్ష రైతుసంఘాలు, వామపక్షాలు, కాంగ్రెస్, ఆప్ నాయకులు తిరువూరు బోస్‌సెంటర్లో ధర్నా నిర్వహించారు. బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, ఆప్ నాయకులు పాల్గొన్నారు.

పైడూరుపాడు సొసైటీ చైర్మన్‌గా పిచ్చయ్య



పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా వేముల పిచ్చయ్యను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీచేసింది. సొసైటీ డైరెక్టర్‌గా కలుపుకూరి సాంబశివరావును ప్రభుత్వం నియమించింది.

సీఆర్పీఎఫ్ దళాల కవాతు

విస్సన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గురువారం విస్సన్నపేటలో సీఆర్పీఎఫ్ దళాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు చేపట్టిన కవాతులో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

ముసునూరు: గోపవరంలో అతి రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం ఎస్ఐ పి.వాసు తన సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.1,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు.

